క్లుప్తంగా

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

అల్లూరు: బీసీ, ఈబీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ రజనీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అల్లూరు మండలానికి బీసీ కార్పొరేషన్ ద్వారా 30, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 10 యూనిట్లు చొప్పున కేటాయించినట్లు చెప్పారు. అర్హులైన వారు ఫిబ్రవరి 7వ తేదీలోగా ఏపీ ఓబీఎంఎంఎస్ సైట్ లేదా సమీపంలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దక్షిణ మధ్య రైల్వే జోన్ బోర్డు సభ్యుడిగా గద్దె వేణుమాధవ్



జలదంకి: మండలంలోని కేశవరం గ్రామానికి చెందిన గద్దె వేణుమాధవ్‌యాదవ్ దక్షిణ మధ్య రైల్వే జోన్ బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ ఉద్యమ నాయకుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య, రైల్వే అధికారుల చేతుల మీదుగా నియామక పత్రాన్ని ఆదివారం అందుకున్నారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యుడిగా అవకాశం కల్పించిన ఆర్ కృష్ణయ్య, రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ఉదయగిరి: స్థానిక షాదీమంజిల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'తరగతి గదిని ఆకర్షణీయంగా నిర్వహించడం ఎలా' అనే అంశంపై ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక ముఖ్య నాయకుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులకు ముఖ్యమైన అంశాలను బోధించారు. జేవీవీ నాయకులు జీ సుధాకర్‌రెడ్డి, షేక్ దస్తగిరిఅహ్మద్, జీ రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వేమన పద్యాలపై ప్రచారం



వింజమూరు (ఉదయగిరి): యోగి వేమన జయంతిని పురస్కరించుకుని వింజమూరులో త్రైత సిద్ధాంత ప్రబోధకులు వేమన పద్యాలపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. వేమన పద్యాలు నిత్య జీవిత సత్యాలని, వాటిని భావి తరాలకు అందించే లక్ష్యంతో విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. సేవా సమితి బాధ్యులు జీ ప్రసాద్, సుధాకర్, నరసింహులు, ఎస్‌కే సలీం, తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంక్ కూల్చివేత



సీతారామపురం: స్థానిక సినిమాహాల్ సెంటర్ ప్రాంతంలో శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా ఉన్న వాటర్ ట్యాంకును ఆదివారం కూల్చివేశారు. గత ఐదు దశాబ్దాల క్రితం గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు వాటర్ ట్యాంకును నిర్మించారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు వాటర్ ట్యాంకు ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. ఇటీవల మినీ వాటర్‌స్కీంలు రావడంతో వాటర్‌ట్యాంకు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. వాటర్ ట్యాంకు వద్ద జనసంచారం అధికంగా ఉంటుంది. శిథిలావస్థకు చేరిన వాటర్‌ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో వాటర్ ట్యాంకును నేలమట్టం చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉచిత వైద్యశిబిరం



సోమశిల: అనంతసాగరం మండలం పడమటి కంభంపాడులో హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన డీఏ స్సార్ న్యూరో కేర్ ఆస్పత్రి వైద్యులు 320 మంది రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అసోసియేషన్ వ్యవస్థాపకులు రొండా వెంకటరమణారెడ్డి, 108 పైలెట్ చింతగుంట నరసింహరెడ్డి, డీఏ స్సార్ న్యూరో కేర్ అధినేత దువ్వూరు దయాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

20కి పైగా కోతుల మృతి



ఉదయగిరి: మండలంలోని కొండాయపాళెం పంచాయతీ సర్వరాబాదు జామాయిల్ తోటల్లో 20కి పైగా కోతుల కళేబరాలను ఆదివారం స్థానికులు గుర్తించారు. కోతులపై విషప్రయోగం చేసి చంపి వాటి కళేబరాలను జామాయిల్ చెట్ల వద్ద పడేసినట్లుగా అనుమానిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. పంచాయతీలకు శాపం

అధికారులు నిర్లక్ష్యం పంచాయతీలకు శాపంగా మారింది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వర్మికంపోస్టు తయారీతో పాటు కొనుగోళ్లను ప్రోత్సహించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. వర్మికంపోస్టుపై రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమవడంతో వారు కొనుగోలుకు ముందుకు రావడం లేదు. ఫలితంగా పంచాయతీలకు ఆదాయం సమకూరడం లేదు.



సీతారామపురంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



విక్రయానికి సిద్ధంగా వర్మికంపోస్టు

వర్మికంపోస్టు కొనడం లేదు



తడి చెత్తతో వర్మికంపోస్టును తయారు చేస్తున్నా కొనేందుకు రైతులు ముందుకు రావడం లేదు. కొంతకాలం కిందట ఓ రైతు రెండు క్వింటాళ్ల ఎరువు తీసుకెళ్లాడు. ఆ తర్వాత ఎవరూ కొనలేదు. నాణ్యమైన ఎరువు అందుబాటులో ఉంది.

– జీవన్, పంచాయతీ కార్యదర్శి

పంటలకు ఎంతో మేలు



పంటలకు రసాయన ఎరువుల కన్నా వర్మికంపోస్టు ఎంతో మేలు. వర్మికంపోస్టు వాడడం వల్ల దిగుబడులు పెరుగుతాయి. ఎరువుల పెట్టుబడి తగ్గుతుంది. వర్మికంపోస్టు ప్రయోజనాలపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించి వాడేలా ప్రోత్సహించాలి.

– రామయ్య, రైతు

రైతులకు అవగాహన కల్పిస్తాం



సంపద కేంద్రాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి వినియోగంలోకి తీసుకొస్తాం. వర్మికంపోస్టు ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి కొనుగోళ్లకు చర్యలు తీసుకుంటాం. తద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరేలా చూస్తాం.

–భార్గవి, ఈఓపీఆర్డీ, సీతారామపురం

సీతారామపురం: పల్లెలను పరిశుభ్రంగా తీర్చిదిద్దే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ఇంటింటి నుంచి తడి చెత్తను సేకరించాలని సంకల్పించింది. దాన్ని వర్మికంపోస్టుగా మార్చి రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించాలని నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం నిధులతో సంపద తయారీ కేంద్రాలను నిర్మించింది. ఇంటింటి చెత్త సేకరణకు గ్రీన్‌అంబాసిడర్లను సైతం నియమించింది. వారు ఇంటింటి నుంచి తడి చెత్తను సేకరించి సంపద కేంద్రానికి తరలించి వర్మికంపోస్టుగా మార్చారు. అలా తయారు చేసిన నాణ్యమైన ఎరువుపై రైతులకు అవగాహన కల్పించి కొనుగోళ్లను ప్రోత్సహించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారడంతో పాటు పంచాయతీలకు ఆదాయం సమకూరడం లేదు. ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల్లో 138 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 37 కేంద్రాల్లో వర్మికంపోస్టును ఉత్పత్తి చేస్తున్నారు. మిగిలిన కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. వర్మికంపోస్టు ఉత్పత్తి చేస్తున్న కేంద్రాల్లో ఏడాదికి సుమారు నాలుగు టన్నుల వరకు ఎరువు తయారవుతుందని అంచనా. మిగిలిన కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తే అధిక మొత్తంలో ఉత్పత్తి చేసేందుకు అవకాశం కలుగుతుంది. అయితే వర్మికంపోస్టుపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవడంతో వారు కొనుగోలుకు ముందుకు రావడం లేదు. మేజర్ పంచాయతీల్లో అడపాదడపా కొనుగోళ్లు జరుగుతున్నా చిన్న పంచాయతీల్లో అసలు లేక వర్మికంపోస్టు అలాగే ఉంటుంది.

ధరల్లో వ్యత్యాసంతో..

సంపద తయారీ కేంద్రాల్లో తయారు చేసిన వర్మికంపోస్టు అమ్మకాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలు ప్రధాన అడ్డంకిగా మారాయి. ప్రైవేట్‌గా వర్మికంపోస్టు తయారు చేసేవారు కిలో రూ.5 చొప్పున విక్రయిస్తుండగా, ప్రభుత్వం కిలో రూ.10 చొప్పున అమ్మకాలు చేస్తోంది. ధరల్లో సడలింపు ఇవ్వకపోతుండడంతో వర్మికంపోస్టు కొనుగోలుకు రైతులు ముందుకు రావడంలేదు. వర్మికంపోస్టు ప్రయోజనాలు, ధరల్లో వ్యత్యాసాలకు గల కారణాలను రైతులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారుతున్నాయి.

బోట్ల బ్రేకింగ్ చేపట్టకుండా చర్యలు తీసుకోవాలి

కావలి: బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద బోట్ల బ్రేకింగ్ పనులను చేపట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఫిష్‌కాస్ రాష్ట్ర కమిటీ డైరెక్టర్ ప్రళయకావేరి వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫిషింగ్ హార్బర్ వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా బోట్లు బ్రేకింగ్ చేస్తున్నారని చెప్పారు. తుప్పు పట్టిన బోట్లను ముక్కలు చేసి స్క్రాప్ కింద విక్రయించడం జరుగుతుందన్నారు. ఈ పనులను సముద్రం వద్ద చేపట్టడం వల్ల వ్యర్థాలు నీటిలో కలిసి విషతుల్యమవుతాయన్నారు. దీని వలన సముద్రంలోని మత్స్యసంపద అంతరించిపోవడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్యంగా పాలయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో కూడా బోట్ల బ్రేకింగ్ కార్యక్రమాలను చేపట్టకుండా అక్కడి మత్స్యకారులు అడ్డుకుని నిలుపుదల చేశారని తెలిపారు. జిల్లా కలెక్టర్‌తో పాటు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు స్పందించి బోట్ల బ్రేకింగ్‌ను చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఫిషింగ్ హార్బర్ వద్ద బోట్ల స్క్రాప్

రియల్‌ఎస్టేట్ రంగానికి సహకరించాలి

కావలి: కావలి పట్టణం, రూరల్, బోగోలు మండలాల్లో రియల్‌ఎస్టేట్ రంగానికి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి సహకరించాలని కావలి రియల్‌ఎస్టేట్ వ్యాపారులు విజ్ఞప్తి చేశారు. కావలిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, జనిగర్ల మహేంద్ర యాదవ్, ఈతముక్కల మురళీరెడ్డి మాట్లాడారు. రియల్‌ఎస్టేట్ రంగానికి రాజకీయాలకు సంబంధం లేదన్నారు. రియల్‌ఎస్టేట్ రంగంపై ప్లాట్లు అమ్మకాలు చేసే వ్యాపారులే కాకుండా రైతులు, ప్లాట్ల కొనుగోలుదారుల సంక్షేమం కూడా ఆధారపడి ఉందన్నారు. అలాగే మధ్య వర్తులు, భవన నిర్మాణ కార్మికులు, బిల్డింగ్ మెటీరియల్ అమ్మకాలు చేసే వ్యాపారులు, చేతివృత్తుల వారి జీవనోపాధులపై కూడా రియల్ ఎస్టేట్ రంగం ప్రభావం ప్రత్యక్షంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవడానికి ఎమ్మెల్యే సూచనలను పాటిస్తామన్నారు. ఈ సమావేశంలో వేముల చెన్నకేశవులు నాయుడు, కాటా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

డీఎస్‌డబ్ల్యూఓ కే శోభారాణి

ఆత్మకూరు: విద్యతోనే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి (డీఎస్‌డబ్ల్యూఓ) కే శోభారాణి తెలిపారు. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల పరిధిలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లోని పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రేరణ, పునశ్చరణ తరగతులను ఆదివారం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీఎస్‌డబ్ల్యూఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యతోనే సమాజంలో గౌరవమర్యాదలు లభిస్తాయన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించాలి. ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదవడం ద్వారా ఉత్తమ ఫలితాలను సాధించవచ్చన్నారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణ సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం అధ్యాపకులు ఇంటర్ విద్యార్థులకు వివిధ సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను డీఎస్‌డీడబ్ల్యూఓ చేతుల మీదుగా అందజేశారు. 2024–25 విద్యా సంవత్సరంలో పదోతరగతి ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.5116, రూ.3116, రూ.2116 నగదు బహుమతులను తన సొంత నిధులతో అందజేస్తానని వెంగంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్ మస్తానయ్య ప్రకటించారు. ఆత్మకూరు సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కే బ్రహ్మానందాచారి, కళాశాల హాస్టల్ వార్డెన్ పద్మనాభరెడ్డి, వార్డెన్లు స్పందన, నిరంజన్, శ్రీకాంత్, సునీల్, ప్రసన్న, చంద్రమదన, రమణారెడ్డి, రామ్మూర్తి, భాస్కర్‌రావు, మహమ్మద్‌ఆలీ, నాగవర ప్రసాద్, కె రవి, భారతి, తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కిట్లు అందజేస్తున్న డీఎస్‌డబ్ల్యూఓ శోభారాణి

ఏవీఎస్ రాష్ట్ర కమిటీలో దువ్వూరువాసి



వినయ్ రాయల్

సంగం: మండలంలోని దువ్వూరుకు చెందిన బోయిన వినయ్ రాయల్ ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ రాష్ట్రాధ్యక్షుడు మల్లవరపు అశోక్‌రెడ్డి నుంచి నియామక పత్రాన్ని అందుకున్నట్లు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన రాష్ట్రాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తురకా ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో, జిల్లాలో ఆంధ్ర విద్యార్థి సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

గౌతమ బుద్ధుడి మార్గం అనుసరణీయం

ఆత్మకూరు: గౌతమ బుద్ధుడు చూపిన శాంతి, ధర్మం, కరుణ మార్గం అనుసరణీయమని, ప్రతిఒక్కరూ అహంకారాన్ని వీడి ఆ మార్గాన్ని అనుసరించాలని విశ్రాంత ఉపాధ్యాయుడు వెలిశెట్టి నారాయణరావు అన్నారు. తెలుగుభారతి సేవా సమితి ఆధ్వర్యంలో మంచి మాట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని గ్రంథాలయం ఆవరణలోని సేవా సమితి సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వెలిశెట్టి నారాయణరావు ప్రధాన వక్తగా హాజరయ్యారు. యశోదనవ్వంది అనే అంశం మీద బుద్ధుడి ప్రవచనాలను వివరించారు. పరివర్తన చెందక ముందు దేవదత్తుడు శక్తి, అధికారం, సంఘంపై ఆధిపత్యం నెలకొల్పాలని ఆశ పడ్డాడని, కోరికల వల్ల జీవితాన్ని నాశనం చేసుకున్నాడని వివరించారు. బుద్ధుడి మార్గమే చివరకు నైతిక మార్గదర్శకంగా నిలిచిందని అంగీకరించాడు. బుద్ధుడి మార్గం అనుసరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుభారతి సేవా భారతి అధ్యక్ష, కార్యదర్శులు సోమవరపు సుబ్బరాయుడు, అంకినపల్లి గోవిందరెడ్డి, పెదవెంకటరెడ్డి, కొల్లా వెంకటేశ్వర్లు, ఎస్వీ రమణయ్య, యానాదిరెడ్డి, కె రవీంద్రకుమార్, శ్రీనివాసరాజు,ఒమ్మిన సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణరావు

ట్రాక్టర్ బోల్తా



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి–ఖాన్‌సాహెబ్‌పేట రోడ్డుపై ఆదివారం ఓ ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఖాన్‌సాహెబ్‌పేటకు చెందిన పొగాకు రైతు వెన్నపూస చెన్నారెడ్డి తన ట్రాక్టర్‌లో పొగాకు కూలీలను తీసుకుని బ్యారెన్ వద్ద విడిచిపెట్టి వెళ్తుండగా అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

పొంచి ఉన్న ముప్పు



ఆత్మకూరులోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా భారీ వేపచెట్టు మోడుబారి ప్రమాదభరితంగా ఉంది. తహసీల్దార్ కార్యాలయ పరిసరాల్లో సబ్‌జైలు, సబ్‌ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్, కోర్టు, ఆర్డీఓ, తదితర ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాలకు నిత్యం వివిధ పనులపై వచ్చే వారు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న చెట్ల కింద సేదతీరుతుంటారు. వాహనాలను సైతం పార్కింగ్ చేస్తుంటారు. మోడుబారిన వేపచెట్టు కొమ్మలు అప్పుడప్పుడు విరిగిపడుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని అధికారులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మోడువారిన చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

– ఆత్మకూరురూరల్

ఐఎంఏ సైన్స్ క్విజ్ పోటీలు

కావలి: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కావలి శాఖ ఆధ్వర్యంలో సైన్స్ క్విజ్ పోటీలను ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని చైతన్య జూనియర్ కళాశాలలోని డాక్టర్ పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి వైజ్ఞానిక ప్రాంగాణంలో నిర్వహించిన పోటీల్లో 8,9,10 తరగతులకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఐఎంఏ గౌరవ సలహాదారుడు బెజవాడ రవికుమార్ విద్యార్థులకు సైన్స్ క్విజ్ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా గుడ్లూరు మండలం తెట్టులోని ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని సోమశిల స్వర్ణలతను ఘనంగా సత్కరించారు. గణిత ఉపాధ్యాయుడు మహేష్ తనప్రాస కవితలతో అలరించారు. ఐఎంఏ కావలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కామంచి సుబ్బారావు, సెక్రటరీ డాక్టర్ గోపీకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ శివప్రసాద్, సైన్స్ క్విజ్ నిర్వాహకులు డాక్టర్ శ్రీరాం మనోహర్‌బాబు, డాక్టర్ కే గంగాధరరెడ్డి, , చైతన్య కళాశాల ప్రిన్సిపల్ టీ లుగోధర్, కరస్పాండెంట్లు వెంకయ్య, మధు, జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు, జానకిరాం, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయిని సత్కరిస్తున్న వైద్యులు

ఆంధ్రకేసరి స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేయాలి

కావలి: పట్టణంలోని జనతాపేటలో ఉన్న ఆంధ్రకేసరి మున్సిపల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను హైస్కూల్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని విశ్రాంత హెచ్‌ఎం, సామాజిక కార్యకర్త సీ శారద డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. 71 ఏళ్ల క్రితం గిరిజన పిల్లల కోసం రూతమ్మ అనే టీచర్ పడమర యానాదిపాళెం స్కూల్‌గా ప్రస్తుత ఆంధ్రకేసరి స్కూల్‌ను ప్రారంభించారని తెలిపారు. గతంలో ప్రాథమిక పాఠశాలగా ఉండగా హెచ్‌ఎంగా పనిచేసిన చాకలకొండ హైమావతి ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయించారని చెప్పారు. ప్రస్తుత హెచ్‌ఎం వెంకటేశ్వర్లు కృషితో 8వ తరగతి కూడా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. పాఠశాలలో పేద, మధ్య తరగతి విద్యార్థులే ఎక్కువగా విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. సంస్కరణల పేరుతో పాఠశాలను డీ గ్రేడ్ చేయడం మంచిదికాదని, హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ప్రభుత్వం అనాలోచితంగా వ్యవహరిస్తే విద్యార్థులు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలతో కలిసి ఉద్యమిస్తామన్నారు.

డీగ్రేడ్ ప్రతిపాదనలను మానుకోవాలి

ఆంధ్రకేసరి మున్సిపల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను డీగ్రేడ్‌చేసే ప్రతిపాదనలను ప్రభుత్వం మానుకోవాలని కలయిక విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఇలింద్ర లావణ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1997–98లో ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రభుత్వ స్కూళ్లను అభివృద్ధి చేస్తున్న క్రమంలో ఆంధ్రకేసరి స్కూల్ హెడ్‌మాస్టర్ హైమావతి ప్రోద్బలంతో తన తండ్రి వరదరాజం జ్ఞాపకార్థంగా తన అమ్మ అనసూయమ్మ పాఠశాల అభివృద్ధికి నగదును విరాళంగా అందజేశారని తెలిపారు. ఆ సమయంలో తాను కూడా విద్యార్థులను ప్రోత్సహించడం కోసం రూ.10వేలు డిపాజిట్ చేసి దానిపై వచ్చే వడ్డీని ఏటావిద్యార్థులకు ఉపకారవేతనంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఎంతో ఖ్యాతి గడించిన ఆంధ్రకేసరి స్కూల్‌ను డీగ్రేడ్ చేయాలని భావించడం బాధాకరమన్నారు.

ఘనంగా అపస్ ఆవిర్భావ దినోత్సవం

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) 41వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అపస్ డివిజన్ కార్యాలయంలో సరస్వతిదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం అపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీ అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు వీ రాఘవరెడ్డి మాట్లాడుతూ 1984లో ఆవిర్భవించిన అపస్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. సభ్యులు పెంచలరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నరసింహారెడ్డి, అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాల అపస్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ప్రమాదాలకు నెలవుగా మహిమలూరు రోడ్డు



మహిమలూరు సమీపంలో బొగ్గేరు కల్వర్టుపై ఓ వైపు కుంగిపోయి ప్రమాదభరితంగా ఉన్న రోడ్డు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు నుంచి నాగులపాడు మీదుగా మహిమలూరు వరకు ఉన్న రోడ్డులో రాకపోకలు సాగించాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. నెల్లూరుపాళెం–ఆత్మకూరు రోడ్డు నుంచి చెర్లోయడవల్లి వరకు గతేడాది తారురోడ్డు నిర్మించారు. రోడ్డుకు ఇరువైపులా రెండేసి మీటర్ల చొప్పున మట్టి తోలాల్సి ఉండగా ఏడాది కాలంగా ఆ ఊసే లేకపోవడంతో ఎదురుగా వాహనాలు వచ్చిన సమయంలో పక్కకు తొలగేందుకు ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. చెర్లోయడవల్లి నుంచి నాగులపాడు మలుపు వరకు కేవలం కంకర తోలి వదిలేయడంతో దుమ్ములోనే నిత్యం వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. బొగ్గేరు నుంచి మహిమలూరు వరకు చక్కటి సిమెంట్ రోడ్డు అందుబాటులో ఉన్నప్పటికీ బొగ్గేరుపై నిర్మించిన కల్వర్టు మధ్య భాగంలో గోడ కూలిపోవడంతో కొంత దూరం ఏకవరసలో వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. ఇక్కడ ఎటువంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో వేగంగా వాహనాలు నడిపే యువకులు ఈ ప్రాంతంలో ప్రమాదాలబారిన పడే అవకాశం ఉందని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఈ మార్గంలోనే అనంతసాగరం, మర్రిపాడు, ఆత్మకూరు మండలాలకు చెందిన పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.



రావులకొల్లు–చెర్లోయడవల్లి మధ్యలో ప్రమాదభరితంగా సైడ్ బరమ్‌లు